
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్టం : 29.0 । కనిష్టం : 18.0
ANDHRAJYOTHY
5

జోగులాంబ
గద్వాల
జిల్లా వార్తలు
గురువారం 27 నవంబరు 2025




వీసీలో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్

గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

- తొలి విడతలో 151సర్పంచ్‌లు, 1,326 వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికలు
- రిటర్నింగ్ అధికారులకు శిక్షణ తరగతులు పూర్తి
- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశామని, తొలి విడతలో 151 సర్పంచ్‌లు, 1,326వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నామని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ నుంచి ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్, అదనపు కలెక్టర్ దేవ సహాయం, డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, ఇతర ఎన్నికల నోడల్ అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మొదటి, రెండో, మూడో విడతలో ఎన్నికలు నిర్వహించనున్న పంచాయతీలు, వార్డుల వివరాలు వెల్లడించారు. పంచాయతీ ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సిబ్బందికి శిక్షణ ఇచ్చామని వివరించారు. తొలి విడత ఎన్నికలకు 46 క్లస్టర్లల్లో గురువారం నామినేషన్లు స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల జాబితా వివరాలతో పాటు పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వివరాలను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వెబ్‌సైట్లల్లో అప్‌లోడ్ చేశామని తెలిపారు. ఈ వీసీలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో వివిధ విభాగాల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం


- హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్ నాయకుడు 7

20.98 శాతం

పంచాయతీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బీసీలకు కేటాయించిన సీట్ల శాతం ఇది

- అన్ని పార్టీల పరంగా టికెట్లు దక్కకపోతే ఎక్కువగా నష్టం
- వంద శాతం ఎస్టీ జనాభా స్థానాలతో ఎస్టీలకు 19.01 శాతం
- ఎస్సీలకు 16.57 శాతం ... జనరల్‌కు 43.44 శాతం సీట్ల కేటాయింపు
- అన్ని కేటగిరీల్లో కలిపి మహిళలకు 45.83 శాతం స్థానాలు
- నేటి నుంచి మొదటి విడత నామినేషన్ల షురూ..
- ఏర్పాట్లు చేసిన అధికారులు





మహబూబ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో బీసీలకు 20.98 శాతం రిజర్వేషన్లు మాత్రమే దక్కాయి. బీసీలకు ప్రస్తుతం 24 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. కానీ ఈ ఎన్నికల్లో అంతకంటే తక్కువ రిజర్వేషన్లు రావడం గమనార్హం. పాత పద్ధతిలోనే రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఆయా జిల్లాల జనాభా దామాషా ప్రకారం కేటాయింపులు జరిగినట్లు స్పష్టమవుతోంది. బీసీలకు గతంలో ఉన్న 24 శాతం రిజర్వేషన్లు కూడా దక్కలేదని విపక్షాలు ఆరోపిస్తు

బీసీలకు 352 స్థానాలు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 1,678 సర్పంచు స్థానాలు ఉన్నాయి. అందులో బీసీలకు 352 స్థానాలు కేటాయించారు. ఈ ప్రకారం ఉమ్మడి జిల్లాలో బీసీలకు 20.98 శాతం రిజర్వేషన్లు మాత్రమే దక్కాయి. డెడికేటెడ్ కమిషన్ నివేదికను ఆధారంగా తీసుకున్నప్పటికీ బీసీలకు రిజర్వేషన్లు తక్కువగా వచ్చాయనే విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి బీసీలకు ప్రస్తుతం విద్య, రాజకీయ, ఇతర రంగాల్లో 24 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. అంతకంటే తక్కువ రావడంతో ఆందోళన నెలకొంది.

అత్యధికంగా గద్వాలలో 27.50 శాతం రిజర్వేషన్లు బీసీలకు రాగా.. నారాయణపేట జిల్లాలో 26.47, వనపర్తిలో 23.50, మహబూబ్‌నగర్‌లో 20.33 శాతం రిజర్వేషన్లు దక్కాయి. తక్కువ సర్పంచు స్థానాలు ఉన్న వనపర్తి, గద్వాల, నారాయణపేటలలో బీసీలకు చట్టబద్ధ రిజర్వేషన్ ప్రకారం కేటాయింపులు ఉండగా.. ఎక్కువ స్థానాలు ఉన్న మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలో అంతకంటే తక్కువ శాతం సీట్లు దక్కాయి. నాగర్‌కర్నూల్‌లో కేవలం 13.26 శాతం మాత్రమే రిజర్వేషన్లు దక్కాయి. అయితే ఇక్కడ ఎస్సీ, ఎస్టీల జనాభా ఎక్కువగా ఉండటంతో వారికి బీసీల కంటే ఎక్కువ సీట్లు కేటాయించారు.

న్నాయి. అన్ని పార్టీలు 50 శాతం కంటే ఎక్కువ స్థానాలు బీసీలకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. గత సర్పంచు ఎన్నికల్లో కూడా జనరల్ స్థానాల్లో చాలా మంది బీసీలు గెలవడంతో ఆయా స్థానాల్లో వారికే పార్టీల మద్దతు తెలిపే అవకాశం ఉంది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రకటించగా.. బీఆర్ఎస్, బీజేపీ కూడా అదే దారిలో నడుస్తాయని సమాచారం. ఎన్నికలకు సంబంధించి మొదటి విడత

(మిగతా 6లో..)

జిల్లాల వారీగా సర్పంచు రిజర్వేషన్ల వివరాలు

జిల్లా	బీసీలకు	ఎస్సీలకు	ఎస్టీలకు	జనరల్
మహబూబ్‌నగర్	86 (20.33%)	60 (13.90%)	100 (23.64%)	177 (42.32%)
గద్వాల	70 (27.5%)	51 (19.16%)	05 (1.96%)	129 (49.49%)
నారాయణపేట	72 (26.47%)	43 (15.28%)	32 (11.76%)	125 (45.82%)
వనపర్తి	63 (23.5%)	39 (14.50%)	49 (18.00%)	117 (43.50%)
నాగర్‌కర్నూలు	61 (13.26%)	85 (18.47%)	133 (28.91%)	181 (39.34%)
మొత్తం	352 (20.98%)	278(16.57%)	319(19.01%)	729(43.44%)

ఆలోచన అదిరింది..



మొక్కజొన్న పంటను ఆశించిన పురుగు నివారణకు ఓ రైతు చేసిన ఆలోచన అదిరింది.. మొక్కజొన్న సుడిలో ఉండే పురుగు నివారణకు మందును పంపుల ద్వారా స్ప్రే చేసినా ఫలితం అంతగా ఉండదు. పూర్తిస్థాయిలో పురుగుల మందు పని చేయాలంటే పురుగు స్థావరం ఏర్పరుచుకున్న మొక్క సుడిలోనే మందు వేయాలి.. ఇందుకోసం ఒక రైతుకు వచ్చిన ఆలోచన అదిరింది. వాటర్ బాటిల్‌లో పురుగుల నివారణ మందును పోసి బాటిల్ మూతకు చిన్న రంధ్రం చేసి కూలీలతో మొక్క సుడిలో మందు వేయిస్తున్న దృశ్యాలను బుధవారం వనపర్తి జిల్లాలోని ఖిల్లాఘణపురం మండలం మానాజీపేట గ్రామానికి వెళ్లే దారిలో ఆంధ్రజ్యోతి కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, వనపర్తి

జిల్లా ప్రధాన న్యాయాధికారిని కలిసిన ఎస్పీ

వనపర్తి లీగల్ కంట్రిబ్యూటర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వనపర్తి ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సునీతరెడ్డి బుధవారం జిల్లా న్యాయాధికారి ఎం.ఆర్ సునీతను ఆమె చాంబర్‌లో కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా వారు జిల్లా శాంతి, భద్రతల పరిరక్షణ, నేర నివారణ చర్యలు, కోర్టు పోలీసు విభాగాల పరస్పర సహకారం, ప్రజా సమస్యల పరిష్కారానికి సంయుక్తంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.


జిల్లా న్యాయాధికారికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ సునీత రెడ్డి

సత్తాచాటిన పెద్దకొత్తపల్లి విద్యార్థులు

- రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక 6

రాజ్యాంగంపై అవగాహన కల్పించాలి

గద్వాల క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా పోలీస్ కార్యాలయంలో నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్పీ శ్రీనివాసరావు బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ దినోత్సవం ద్వారా ప్రజలకు రాజ్యాంగ విలువలు, పౌర హక్కులు, బాధ్యతలు, కర్తవ్యాలపై అవగాహన కల్పించడం అందరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శంకర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు, సిబ్బంది

వైభవంగా శ్రీనివాసుడి పల్లకీ సేవ

మల్దకల్, నవంబరు 26:(ఆంధ్రజ్యోతి) జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీనివాసుడి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఊరేగించారు. ఆధ్యాత్మిక ప్రముఖులు శ్రీవిద్యాసింధు మాదవతీర్థులు, మాతాశ్రీ భైరవి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యారు. వారిని ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు పూర్ణకుంబ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు.


శ్రీనివాసుడి పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు, స్థానికులు

ముంపు భూముల వివరాలు పరిశీలన

6

గో-గేమ్ పోటీల్లో 3 స్వర్ణాలు, 3 రజత పతకాలు

యూనివర్సిటీకి పేరు తేవాలి

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్
- ఆల్ ఇండియా టోర్నీకి క్రీడాకారుల ఎంపిక

6

భారత రాజ్యాంగం ప్రపంచానికి దిక్సూచి

- అన్ని వర్గాలకు సమాన అవకాశాలు
- ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 110.00
హోల్ సేల్	: 122.00
డ్రెస్డ్	: 191.00
స్కిన్ లెస్	: 218.00

నిధులు ఇవ్వండి.. రోడ్డు వేసుకుంటాం

- కలెక్టర్‌ను కోరిన గుర్రంగడ్డ ప్రజలు
- గత ఏడాది రోడ్డు నిర్మాణ బిల్లు పెండింగ్
- ఇప్పటివరకు పూర్తి కాని బ్రిడ్జి నిర్మాణం
- గ్రామంలోనే ఖరీఫ్ ధాన్యం


కృష్ణానదికి వరదతో కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

గద్వాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బ్రిడ్జి నిర్మాణం ఏళ్ల తరబడి కొనసాగుతుండటంతో దీవి గ్రామం గుర్రంగడ్డ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతీ ఏడాది కృష్ణానదికి వరద తగ్గిన తర్వాత గ్రామస్థులు రంగాపురం వైపు నదిలో తాత్కాలిక రోడ్డు నిర్మించుకొని వ్యవసాయ ఉత్పత్తులను తరలించుకుంటారు. అదే విధంగా ఖరీఫ్, రబీ పంటలకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను ఒకేసారి తెచ్చుకుంటారు. ఇదే పద్ధతిని గత కొన్నేళ్లుగా సాగిస్తున్నారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్రంగడ్డకు బ్రిడ్జిని మంజూరు చేశారు. ఆ వెంటనే రూ.12 కోట్ల నిధులను విడుదల చేస్తూ జీవోను జారీ చేశారు. అప్పటి నుంచి బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసా..గుతూనే ఉన్నాయి.


తాత్కాలిక రోడ్డు నిర్మాణం

గుర్రంగడ్డ గ్రామానికి రంగాపురం వైపు కృష్ణానది (పాయ) వేసవిలో ఒట్టిపోతుంది. దీంతో ఆ వైపు నుంచి రాకపోకలను సాగించడానికి వీలవుతుంది. 2016లో దీవి గ్రామ ప్రజలు మట్టి పోసి తాత్కాలికంగా రోడ్డు నిర్మించుకున్నారు. ప్రతీ ఏడాది వానాకాలంలో కృష్ణానదికి వరద వచ్చినప్పుడు ఈ రోడ్డు కొట్టుకుపోతుంది. వరద తగ్గి నీరు ఒట్టిపోయాక మళ్లీ నిర్మించుకోవాల్సి ఉంటుంది. దాదాపు 9 ఏళ్లగా గ్రామస్థులు ఇలా రోడ్డు నిర్మించుకుంటూనే ఉన్నారు. మొదట గ్రామస్థులు చందాలు పోగుచేసుకొని నిర్మించుకోగా, ఐదేళ్లుగా కలెక్టర్ తన నిధులను విడుదల చేస్తున్నారు. అయితే బ్రిడ్జి నిర్మాణం ఏళ్లుగా సాగుతుండటం, ప్రతీ ఏడాది వేసిన రోడ్డుకే నిధులు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధం కావడంతో ఇదే చివరి సారని, గత ఏడాది కలెక్టర్ చెప్పారు. కానీ ఈ ఏడాది కూడా బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాలేదు. తాత్కాలిక రోడ్డు మళ్లీ కొట్టుకుపోయింది.

నిలిచిపోయిన ధాన్యం తరలింపు

గ్రామానికి తాత్కాలిక రోడ్డును నిర్మిస్తే తప్ప గ్రామంలోకి వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. దీంతో ప్రస్తుత వానాకాలంలో పండించిన ధాన్యం అంతా గ్రామంలోనే ఉంది. కలెక్టర్, పంచాయతీరాజ్ అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. గత ఏడాది వేసిన రోడ్డుకు ఇప్పటి వరకు నిధులు విడుదల కాకపోవడంతో, ఈ సారి ఎవరూ పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదని అంటున్నారు. ఈ విషయంపై వారు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. నిధులు మంజూరు చేస్తే రోడ్డు వేసుకుంటామని తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి



ఏళ్లుగా బ్రిడ్జి నిర్మాణం జరుగుతూనే ఉంది. ఒక కాంట్రాక్టర్ వదిలి వెళ్లిపోతే, మరో కాంట్రాక్టర్ వచ్చాడు. ఈ ఏడాది వరద తగ్గి నెల గడుస్తున్నా ఇంకా పనులు మొదలు పెట్టలేదు. వెంటనే పనులను ప్రారంభించి ఈ ఏడాదైన బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి.

- నాగేశ్వర్‌రెడ్డి, రైతు, గుర్రంగడ్డ

తాత్కాలిక రోడ్డే దిక్కు



ప్రతీ ఏడాది మాకు తాత్కాలిక రోడ్డే దిక్కు అవుతోంది. ఈ రోడ్డు వరద వస్తే కొట్టుకుపోతోంది. ఈ ఏడాదైనా వంతెన పనులు పూర్తి చేయించాలి. అప్పటి వరకు తాత్కాలిక రోడ్డు నిర్మించాలి. రోడ్డు వేస్తేనే ధాన్యాన్ని తరలించేందుకు వీలు అవుతుంది.

- టీకే వెంకటన్న, రైతు గుర్రంగడ్డ

ఎన్నికల నియమావళిని పాటించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినందున జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అధికారలు పకడ్బందీగా అమలుంచేయాలని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ సునీత రెడ్డితో కలిసి ఎన్నిలక నోడల్ అధికారులు, ఎంపీడీవోలు తహసీల్దార్‌లతో వీసీలో మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, నామినేషన్ల ప్రక్రియపై దిశా నిర్దేశం చేశారు. పంచాయతీ ఎన్నికలు మూడు విడుతల్లో నిర్వహించడం జరుగుతుందని, మొదటి విడతలో పెద్దమందడి, ఘణపూర్ గోపాల్‌పేట, రేవల్లి, ఎదుల మండలాల్లోని 86 గ్రామపంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు గాను రేపు ఉదయం 10 గంటల లోపు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి ఆర్‌ఓ కార్యాలయంతో పాటు సంబంధిత 87 గ్రామ పంచాయతీలలో అతికించాల్సి ఉంటుందని తెలిపారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. ఎస్పీ డి.సునీత రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 4 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఈ రోజు నుంచే నిఘా పెట్టామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ ఎన్. ఖీమ్యనాయక్ ,అదనపు కలెక్టర్ యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డీపీవో తరుణ్ చక్రవర్తి, నోడల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

‘దిశ’ ఎన్‌కౌంటర్‌తో ఆగమైన బతుకులు

- న్యాయం కోసం ఆరేళ్లుగా పోరాటం
- 2019, నవంబరు 27న సంఘటన
- డిసెంబరు 6న పోలీసుల కాల్పుల్లో నిందితులు మృతి


చటాన్‌పల్లి వద్ద ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్) 6

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

- భక్తిశ్రద్ధలతో గోపుర కలశ ప్రతిష్ఠ
- కొండారెడ్డిపల్లిలో ఆధ్యాత్మిక శోభ
- ఉత్సవానికి హాజరైన సీఎం సోదరులు 7

రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలి

- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ
- ప్రత్యేక వార్డుల్లో రోగులతో మాట్లాడి సేవలపై ఆరా 8

20.98 శాతం..

(5వ పేజీ తరువాయి)

నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది.

ఎస్టీలకు కలిసొచ్చిన 100 శాతం జీపీలు..

గత ప్రభుత్వ హయాంలో తండాలను పంచాయతీలు చేసి.. చట్టంలో 100 శాతం ఎస్టీ జనాభా ఉన్న పంచాయతీల్లో వారికే రిజర్వేషన్ కల్పించాలని పొందుపర్చారు. దాని ప్రకారం ఎస్టీలకు ఉమ్మడి జిల్లాలో 319 స్థానాలు రిజర్వు అయ్యాయి. మొత్తం సీట్లలో 19.01 శాతం వారికి దక్కింది. అయితే జనాభాలో ఎస్టీలకు కంటే ఎక్కువ శాతం ఉన్న ఎస్సీలకు 278 స్థానాలతో 16.57 శాతం రిజర్వేషన్లు మాత్రమే దక్కాయి. అన్ని కేటగిరీల్లో కలిపి మొత్తం 1,678 స్థానాల్లో మహిళలకు 769 స్థానాలు కేటాయించారు. మహిళలకు 45.83 శాతం రిజర్వేషన్లు కల్పించారు. వారికి స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే నిబంధన మేరకు నిర్ణయం తీసుకున్నారు. 729 స్థానాలు అన్ రిజర్వ్‌డ్‌కు కేటాయించగా.. 43.44 శాతం జనరల్ కేటగిరీలో ఉంది. ఇందులో ఏ కేటగిరి వారైనా పోటీ చేయొచ్చు. అన్ రిజర్వ్‌డ్ కేటగరీలోనే ఇప్పుడు బీసీలకు ఎంత శాతం పార్టీపరంగా ఇస్తారనే విషయంపై నాయకులు తర్జనభర్జన పడుతున్నారు. పార్టీ గుర్తుపై జరిగే ఎన్నికలు కాకపోవడంతో కేవలం మద్దతుదారులను మాత్రమే నిర్ణయించాల్సి ఉంటుంది. కానీ గ్రామాల్లో మాత్రం పార్టీల వారిగానే ప్రచారం జరుగుతుందనడంలో సందేహం లేదు.

ముంపు భూముల వివరాల పరిశీలన



ఏదుల రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన రైతుల వివరాలను సేకరిస్తున్న జిల్లా అధికారులు

కోడేరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన తీగలపల్లి గ్రామ భూ నిర్వాసితుల వివరాలను సేకరించడంతో పాటు తనిఖీ చేయడం జరుగుతుందని సర్వే విభాగం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ అన్నారు. బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నరసింహ మాట్లాడారు. క్షేత్రస్థాయిలో జిల్లా యంత్రాంగం సర్వే నిర్వహించి రైతుల వివరాలను పరిశీలించారన్నారు. మండల సర్వేయర్ మహేష్‌తో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

గో-గేమ్ పోటీల్లో 3 స్వర్ణాలు, 3 రజత పతకాలు



జాతీయస్థాయి గో-గేమ్ టోర్నీలో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఒడిశా రాష్ట్రంలోని పూరీ క్షేత్రంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించిన జాతీయస్థాయి గో-గేమ్ సబ్ జూనియర్, జూనియర్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. క్రీడాకారులు లలితేష్, రాహుల్, రాజేశ్ స్వర్ణ పతకాలను సొంతం చేసుకున్నారు. మహ్మద్ సోబానుర్దీన్, చేతన్‌చంద్ర, వర్షిత్‌లు రజత పతకాలను సాధించారు. ఈ సందర్భంగా వారిని గో-గేమ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నస్రూరుల్లా హైదర్, గులాం అఫ్రోజ్, ట్రెజరర్ వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడు మహ్మద్ షకీల్ అభినందించారు.

భారత రాజ్యాంగం ప్రపంచానికి దిక్సూచి

- అన్ని వర్గాలకు సమాన అవకాశాలు
- ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

మహబూబ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగం ప్రపంచానికే దిక్సూచి అని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. న్యూటౌన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ తెలంగాణ చౌరస్తా వరకు కొనసాగింది. అక్కడ యూనియన్ సభ్యులు, విద్యార్థులు రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ భారత రాజ్యాంగం అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందన్నారు. బలహీన వర్గాలపై దాడులు జరుగుతున్నా, కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణకోసం ప్రజలందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ ఆల్‌ఇండియా లీగల్ సెల్ కోకన్వీనర్ అక్బర్, రాష్ట్ర కార్యదర్శి శేఖర్, నాయకులు కార్తీక్‌రెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- చైల్డ్ వెల్ఫేర్ అధికారి లక్ష్మీదేవి



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ఎర్రవల్లి, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చైల్డ్ వెల్ఫేర్ అధికారి లక్ష్మీదేవి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల పరిధిలోని కొండేరుకు చెందిన యువకుడికి, కర్ణాటకలోని రాయచూరు జిల్లా, హోసూరు గ్రామానికి చెందిన బాలికతో వివాహం జరిగింది. విషయం తెలుసుకున్న చైల్డ్ వెల్ఫేర్ అధికారులు గ్రామానికి చేరుకుని ఇరు కుటుంబాల సభ్యులతో మాట్లాడారు. రెవెన్యూ, పోలీసుల అధికారుల సహకారంతో బాలికను చైల్డ్ వెల్ఫేర్ అధికారుల ముందు హాజరు పరిచి గద్వాలలోని సఖి కేంద్రానికి తరలించారు.

'దిశ' ఎన్‌కౌంటర్‌తో ఆగమైన బతుకులు

- న్యాయం కోసం ఆరేళ్లుగా పోరాటం
- 2019, నవంబర్ 27న సంఘటన
- డిసెంబర్ 6న పోలీసుల కాల్పుల్లో నిందితుల మృతి



మక్తల్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'దిశ' ఎన్‌కౌంటర్‌తో బాధిత కుటుంబాల బతుకులు దుర్భరంగా మారాయి. ఈ సంఘటన జరిగి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' గుడిగండ్ల, జక్లేర్ గ్రామాల్లోని బాధితుల ఇళ్లకు వెళ్లింది. బాధితులతో మాట్లాడి ప్రస్తుతం వారి స్థితిగతులను తెలుసుకున్నది. సీన్ రీకన్‌స్ట్రక్షన్ పేరుతో తీసుకువెళ్లిన పోలీసులు తమ పిల్లలను కాల్చివేసి ఎన్‌కౌంటర్ చేశామని చెప్పడం అన్యాయం అన్నారు. వారు తప్పు చేసి ఉంటే చట్టపరంగా శిక్షించాలి కానీ, ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చివేయడం ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరుగుతుందని ఆరేళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. అందుకు బాధ్యులైన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. బాధిత కుటుంబ సభ్యుల ఆవేదన వారి మాటల్లోనే...

కొడుకు మీద బెంగతో...



బూటకపు ఎన్‌కౌంటర్‌తో మా కొడుకు జొల్లు శివను పొట్టనపెట్టుకున్నారు. కొడుకు లేడన్న దిగులుతో మా ఆయన కూడా చనిపోయాడు. నాకు కనీసం వితంతు పెన్షన్ కూడా రావడం లేదు. వయసు పైబడటంతో కూలీకి కూడా పోలేకపోతున్నాను. ప్రస్తుతం రేకుల షెడ్‌లో నివసిస్తున్నాను. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెన్షన్ మంజూరు చేయాలి.

- జొల్లు శివ తల్లి మణెమ్మ, గుడిగండ్ల.

మా కుటుంబాన్ని ఆదుకోవాలి



దిశ ఎన్‌కౌంటర్‌తో ఉన్న ఒక్కగానొక్క కుమారుడు ఆరీఫ్‌ను కోల్పోయాం. మా కుమారుడు ఏం తప్పు చేశాడో తెలియదు కానీ మాకు దిక్కులేకుండా పోయింది. వృద్ధాప్యం కారణంగా ఏ పనీ చేయలేని స్థితిలో ఉన్నాం. మేము ఉంటున్న పెంకుటిల్లు శిథిలావస్థలో ఉంది. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. బూటకపు ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులపై తక్షణ చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వం మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

- ఆరీఫ్ తల్లిదండ్రులు హుసేన్, మౌలాన్‌బీ, జక్లేర్

జీవనం దుర్భరంగా మారింది



మా కొడుకు చెన్న కేశవులును పోలీసులు ఎన్‌కౌంటర్ పేరుతో పొట్టన పెట్టుకున్నారు. ఆ తర్వాత మూడు నెలలకే నా భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఎన్‌కౌంటర్ సమయంలో కోడలు (చెన్నకేశవులు భార్య) గర్భవతి. కోడలు బతుకుదెరువుకోసం హైదరాబాద్‌కు వలస వెళ్లింది. నేను ఆరేళ్ల మనవరాలు చందనతో కలిసి ఉంటున్నాను. కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాను. ప్రభుత్వం స్పందించి మా కుటుంబానికి న్యాయం చేయాలి.

- చెన్న కేశవులు తల్లి జయమ్మ, కూతురు చందన

ఈ కష్టం ఏ తల్లికీ రావద్దు



ఎన్‌కౌంటర్ పేరుతో మా కుమారుడు జొల్లు నవీన్‌కుమార్‌ను పోలీసులు అకారణంగా చంపేశారు. వాడు తప్పు చేసి ఉంటే శిక్షలు వేయడానికి కోర్టులు ఉన్నాయి. కానీ ఎవరో చేసిన తప్పులకు మా పిల్లవాడ్ని బలిచేశారు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ పేరుతో ఎన్‌కౌంటర్ చేసిన పోలీసు అధికారులను కఠినంగా శిక్షించి, మా కుటుంబానికి న్యాయం చేయాలి. ఈ కష్టం ఏ తల్లికీ రాకూడదు.

- జొల్లు నవీన్‌కుమార్ తల్లి లక్ష్మి

దేశవ్యాప్తంగా సంచలనం

హైదరాబాద్ సమీపంలోని ఔటర్ రింగ్‌రోడ్డు, తొండుపల్లి టోల్‌ప్లాజా సర్వీస్ రోడ్డు వద్ద 2019, నవంబర్ 27న 26 ఏళ్ల యువతిపై నలుగురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. మృతదేహాన్ని లారీలో తీసుకొచ్చి షాద్‌నగర్ సమీపంలోని చటాన్‌పల్లి అండర్‌పాస్ వద్ద దహనం చేశారు. ఆ తర్వాత నిందితులను అరెస్టు చేసిన పోలీసులు, డిసెంబర్ 6న వారిని సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం అండర్‌పాస్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు నిందితులు మృతి చెందారు. వారిలో ఇద్దరు నిందితులు తుపాకులు లాక్కొని దాడికి యత్నించడంతో కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. అది బూటకపు ఎన్‌కౌంటర్ అన్న విమర్శలు వ్యక్తమయ్యాయి.

నల్లచట్టాలతో కార్మికులకు అన్యాయం

- కార్మిక సంఘాల నాయకుల నిరసన
- మహబూబ్‌నగర్ పట్టణంలో భారీ ర్యాలీ



మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కార్మికులు, నాయకులు

పాలమూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మికులకు అన్యాయం చేసే నల్ల చట్టాలను అమలు చేస్తే గుణపాఠం చెప్తామని ఆల్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు హెచ్చరించారు. వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని టౌన్‌హాల్ నుంచి గడియారం చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఏ.రాములు, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.వెంకటేశ్, దేవదానం, సాంబశివుడు, సీఐటీయూ నాయకులు నల్లవెల్లి కురుమూర్తి, కిల్లెగోపాల్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, సురేశ్, ఐఎన్‌టీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు రాములుయాదవ్, రాంమోహన్ ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను చాపకింద నీరులా అమలు చేస్తోందన్నారు. 29 చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా తీసుకొచ్చిందన్నారు. కనీస వేతనాలు, సమానపనికి సమాన వేతనం ఇవ్వకుండా, ఎంతోకాలం నుంచి పని చేస్తున్నా పర్మినెంట్ చేయకుండా కార్మిక లోకానికి తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు.

విదేశాలనుంచి దిగుమతి చేసుకునే పత్తికి 11 శాతం సుంకం విధించాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ కూలీలకు ఏడాదికి 200 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. రైతు, నల్లచట్టాలను తక్షణమే ఉపసం హరించుకోకపోతే దేశవ్యాప్తంగా మరో పోరా టానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాంచందర్, పోలె జగన్, మోహన్, దేవదాసు, ఏ.లక్ష్మయ్య, వి.కురుమూర్తి, చంద్రకాంత్, రాజ్, వి.హనుమంతు, ఎం.రాములు, శివ లీల, ఎర్ర నరసింహులు, ప్రభాకర్, కేశవులు, వెంకట్రాములు, దున్న ఖాదర్, భాగ్యమ్మ, లక్ష్మి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన పెద్దకొత్తపల్లి విద్యార్థులు

- రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన పెద్దకొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు డి.మనీష్‌కుమార్, పుట్ట చందన, సి.రామకృష్ణ

పెద్దకొత్తపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాస్థాయి అండర్-17 బాల, బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థులు డి.మనీష్‌కుమార్ (9వ తరగతి) 55 కిలోల విభాగంలో స్నాచ్ 40 కిలోలు, క్లీన్ అండ్ జర్క్ 62 కిలోలు, మొత్తం 102 కిలోల బరువెత్తి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. 69వ ఎస్‌జీఎఫ్ఐ ఉమ్మడి జిల్లా అండర్-17 బాలబాలికల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో అదే పాఠశాల పదవ తరగతి విద్యార్థిని పుట్ట చందన 40 కిలోల కేటగిరీలో స్నాక్స్ 25 కిలోలు, క్లీన్ అండ్ జర్క్ 65 కిలోలు, మొత్తం 105 కిలోల బరువెత్తి ప్రథమ స్థానంలో నిలిచింది. అదే పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి రామకృష్ణ 55 కిలోల విభాగంలో స్నాక్స్ 40, క్లీన్ అండ్ జర్క్ 65 కిలోలు, మొత్తం 105 కిలోల బరువు ఎత్తి ప్రథమ స్థానాన్ని సొంతం చేసుకున్నాడు.

ఒకే పాఠశాలకు వీరు ముగ్గురూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని ప్రధానోపాధ్యాయుడు, ఇన్‌చార్జ్ ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు బాల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇసుక అక్రమ రవాణా

- అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

కృష్ణ/ మాగనూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, కృష్ణ మండలంలో పెద్దవాగునుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పట్టుకున్నారు. మండల పరిధిలోని తాళంకేరిలో వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే మక్తల్‌కు తరిగి వెళ్తుండగా, ఇసుక తరలిస్తున్న టిప్పర్ కనిపించింది. దీంతో ఎమ్మెల్యే దానిని ఆపి అనుమత్రాలను చూపించాలని అడిగాడు. అందుకు డ్రైవర్ సరైన సమాధానం ఇవ్వకపోవడంతో రెవెన్యూ , పోలీస్ అధికారులకు ఫోన్ చేసి చెప్పారు. వారి నుంచి సరైన స్పందన లేకపోవడంతో కలెక్టర్ సీసీకి ఫోన్ చేసి మాట్లాడారు. పెద్దవాగు నుంచి ఇసుక తరలింపునకు అనుమతులు ఇవ్వలేదని ఆయన సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్ద వాగు నుంచి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోర్టు ఆదేశించినా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. ఆ తర్వాత టిప్పర్‌ను స్థానిక ఏఎస్ఐకి అప్పగించారు. అంతకుముందు ఇసుక తరలిస్తున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించిన టిప్పర్లను గ్రామస్థులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఇరువర్గాలను శాంతింపచేశారు.

మరో రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

గద్వాల/ వెల్దండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. గద్వాల మండలంలోని బసవచెరవు గ్రామానికి చెందిన డ్రైవర్ మౌలాలి మంగళవారం రాత్రి 11.30 గంటల సమయంలో కృష్ణానది సమీపంలోని పెబ్బేరు మండలంలో రంగాపురంలో టిప్పర్‌లో ఇసుక లోడ్ చేసుకున్నాడు. అక్కడి నుంచి గద్వాలకు తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకొని, టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని కొట్ర సమీపంలో ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ను బ్లూకోట్ కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, రాఘవేందర్‌గౌడ్‌లు పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించారు.

టిప్పర్ యజమాని గుందూరు గ్రామానికి చెందిన రాంరెడ్డి, డ్రైవర్ పంజుగుల గ్రామానికి చెందిన అంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో.. ముగ్గురికి జైలు శిక్ష

కల్వకుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ముగ్గురికి న్యాయాధికారి జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఎస్ఐ జి.మాధవరెడ్డి తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురిని బుధవారం కల్వకుర్తి కోర్టులో హాజరుపరిచారు. వారిలో వెల్దండ మండలం, రాచూరు గ్రామానికి చెందిన కోరకుల వెంకటేశ్‌కు 3 రోజులు, కల్వకుర్తిలోని విద్యానగర్ కాలనీకి చెందిన దోర్నాల సంతోష్‌రెడ్డికి 2 రోజులు, నల్గొండ జిల్లా డిండి గ్రామానికి చెందిన సుంకోజు ఆకాశ్‌చారికి 2 రోజుల జైలు శిక్ష, రూ. 500 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయాధికారి జడ కావ్య తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళల అభ్యున్నతే తెలంగాణ ప్రగతి

- గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



మన్ననూరులో మంత్రి సీతక్కను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మన్ననూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : 'మహిళల అభ్యున్నతే తెలంగాణ ప్రగతి' అనే నినాదంతో రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం శ్రీశైలం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆమె నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు అంబేడ్కర్ చౌరస్తా వద్ద కొద్దిసేపు ఆగారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడే ఉన్న గద్దర్ విగ్రహం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆమెను సన్మానించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలు పేదలకు అందినప్పుడే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. రాష్ట్రంలో రేవంత్ సర్కార్ ఇందిరమ్మ స్ఫూర్తితో మహిళా సంఘాలను బలోపేతం చేస్తోందన్నారు. రెండేళ్లుగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్న తమ సర్కారుపై చౌకబారు విమర్శలు చేస్తూ, నిందలు మోపడం బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావులకు అలవాటుగా మారిందన్నారు. నల్లమల ప్రాంత సమస్యలపై తనను ఎప్పుడైనా కలవొచ్చన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినారాయణగౌడ్, ఉమామహేశ్వర పాలకమండలి డైరెక్టర్ సంభు శోభ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రహీం, సంభు వెంకట్‌రమణ, రాజారాం, వెంకటేశ్వర్లు, బుచ్చయ్య, శివాజీ, రహిమాన్, సంతోష్, మెహరాజ్, ఇస్మాయిల్, జాకీర్, కర్ణయ్య పాల్గొన్నారు.

యూనివర్సిటీకి మంచి పేరు తేవాలి

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్
- ఆల్ ఇండియా టోర్నీకి క్రీడాకారుల ఎంపిక



క్రీడకారులను పరిచయం చేసుకుంటున్న పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో రాణించి యూనివర్సిటీకి మంచి పేరు తేవాలని వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే మహిళలు, పురుషుల జట్ల ఎంపికకు బుధవారం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని, పోటీలను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సౌత్‌జోన్, ఆలిండియా స్థాయిలో పాల్గొనే క్రీడాకారులకు ఉద్యోగాలలో రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు ప్రొఫెసర్ సత్యభాస్కర్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి చిన్నవీరయ్య, కోచ్‌లు సుచేతన్‌రెడ్డి, గీత పాల్గొన్నారు.

ధాన్యం కుప్పను ఢీకొన్న బైక్

- యువకుడికి గాయాలు

కొత్తపల్లి, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపైన రైతులు ఏర్పాటు చేసిన ధాన్యం కుప్పకు బైక్ ఢీకొనడంతో కిందపడి ఓ యువకుడు గాయపడ్డాడు. నారాయణపేట జిల్లా, కొత్తపల్లి మండలంలోని గుండుమాల్ - కొటకొండ రైతులు ప్రతీ రోజు ధాన్యం ఆరబోస్తున్నారు. సాయంత్రం ధాన్యం కుప్పలు పోసి టార్పాలిన్‌తో కప్పుతున్నారు. నారాయణపేట మండలంలోని బండగొండ గ్రామానికి చెందిన నరేశ్ కొత్తపల్లి నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. భూనీడు శివారులో రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్పలను గమనించకుండా ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్‌పై నుంచి పడి వలస కూలీ మృతి

తాడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌పై నుంచి కింద పడి అతనిపై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండల కేంద్ర సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా దేవనకొండ మండలం చెలిమిల గ్రామానికి చెందిన హుస్సేన్(33) ఇతను పత్తి తీసేందుకు కోసం కూలీ పనుల నిమిత్తం తెలకపల్లి మండలం తాళ్లపల్లి గ్రామానికి వలస కూలీగా వచ్చాడు. బుధవారం తెల్లవారుజామున హుస్సేన్ సొంత ఊరికి వెళ్లేందుకు నడుచుకుంటూ తాడూరు వైపు వస్తున్న నేపథ్యంలో మట్టి ట్రాక్టర్ రావడంతో సహాయం అడిగి ట్రాక్టర్‌పై వస్తున్న క్రమంలో తాడూరు గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి కిందపడిపోయాడు. వెను వెంటనే అతనిపై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై మృతుని భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. జరిగిన ఘటనపై విచారణ చేపడుతామని తెలిపారు.

మద్యం దుకాణంలో చోరీ



దొంగలు ధ్వంసం చేసిన దుకాణం షట్టర్

మానవపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండల కేంద్రంలోని సాయి వైన్స్‌లో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. దుకాణం యజమాని ఓంప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి దుకాణం షట్టర్‌ను మూసివేసి తాళాలు వేసి పనివారు ఇళ్లకు వెళ్లిపోయారు. అర్ధరాత్రి తర్వాత దొంగలు షట్టర్‌ను కొంత పైకి ఎత్తి లోనికి ప్రవేశించి మద్యం బాటిళ్లతో పాటు, కొంత నగదును ఎత్తుకెళ్లారు. ఇది స్థానికులు చేసిన పని కాదని, ఇతర ప్రాంతాల వారే అయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నవాబ్‌పేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో పనులు ముగించుకుని బైక్‌పై గ్రామానికి వస్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సున్నల అంజయ్య బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో పనులు ముగించుకుని తన బైక్‌పై వస్తుండగా గుర్తు తెలియని వాహనం రహదారి పక్కన ఆగి ఉండటంతో కనిపించక ఢీ కొట్టాడు. ఈ ఘటనలో అంజయ్యకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

కారు ఢీకొని మరొకరికి..

బిజినేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని నంది వడ్డేమాన్ గ్రామానికి చెందిన మండల శ్రీనివాసులు (48) అనే వ్యక్తి బుధవారం సాయంత్రం స్వంత పనుల నిమిత్తం బైక్‌పై నాగర్‌కర్నూల్‌కు వెళ్తున్నారు. వెంకటాపూర్ గ్రామ సమీపంలో వెనక నుంచి కారు ఢీకొట్టింది. అటుగా వెళ్తున్న డీసీఎం కింద పడి తీవ్ర గాయాలపాలైన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు గమనించి వెంటనే 108కు సమాచారం ఇచ్చి చికిత్స కోసం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. రెండు కాళ్లు నుజ్జు, నుజ్జు కావడంతో శ్రీనివాసులు పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. ఈ ఘటనపై బాధితుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కే.శ్రీనివాస్ తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధం

» రూ 1.75 లక్షల నష్టం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాన్‌గల్ ,నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్‌పై పశుగ్రాసం తీసుకొస్తుండగా, విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండలంలోని రాయినిపల్లికి చెందిన రైతు సంగనమోని సాంబశివుడు పొలం నుంచి ఇంటికి ట్రాక్టర్‌లో పశు గ్రాసాన్ని తీసుకొస్తుండగా దారిలో 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ ట్రాలీ నుంచి ఇంజన్‌ను తప్పించాడు. స్థానికులు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో పశుగ్రాసంతో పాటు ట్రాలీ పూర్తిగా కాలి బూడిదయ్యింది. దీంతో రూ. 1.75 లక్షలు వాటిల్లిందని రైతు తెలిపారు.


తుపత్రాలలో గడ్డివాములు..

అయిజ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మునిసిపాలిటీ పరిధిలోని తుపతురాల గ్రామంలో గడ్డివాములు దగ్ధమయ్యాయి. కురువ ఉశేని, కుమ్మరి శేఖర్‌లకు చెందిన గడ్డివాములకు బుధవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు నిప్పంటుకున్నది. గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్‌ఇంజన్ వచ్చేలోపే గడ్డివాములు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. దీంతో దాదాపు రూ. 50 వేల నష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

మహబూబ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన చరణ్ ముదిరాజ్ (20) రాంనగర్‌లో మురళి అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్ వర్క్‌షాప్‌లో ఆరు నెలలుగా పనిచేస్తున్నాడు. కార్మికుల కోసం కంపెనీ ఏర్పాటు చేసిన అద్దె ఇంట్లో ఉంటున్నాడు. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో తోటి కార్మికులంతా వారి ఇళ్లకు వెళ్ళిపోగా, చరణ్ ఒక్కడే గదిలో ఉన్నాడు. ఆ తర్వాత అర్ధరాత్రి సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం తోటి కార్మికులు అతడికి ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో అద్దె ఇంటికి వెళ్లి చూడగా ఉరివేసుకొని కనిపించాడు. చరణ్ కొద్దిరోజులుగా వెన్నునొప్పితో బాధపడుతున్నాడని, అది భరించలేక ఆత్మహత్య చేసుకొని ఉంటాడని అతడి తల్లి యాదమ్మ తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ శీనయ్య తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



ఆటోలో తరలిస్తున్న మద్యం

గద్వాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా ఆటోలో తరలిస్తున్న మద్యం కార్టన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గద్వాల రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అనంతపురం గ్రామానికి చెందిన ముష్టి నారాయణ బుధవారం జమ్ములమ్మ కమాన్ ఎదురుగా ఉన్న రేణుక వైన్‌షాప్ నుంచి 18 కార్టన్ల మద్యాన్ని తీసుకొని, తన ఆటోలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆటోతో పాటు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుకున్నదొకటి.. అయ్యింది మరొకటి

» సర్పంచ్ స్థానాల రిజర్వేషన్ల మార్పు
» పలువురు ఆశావహులకు తప్పని నిరాశ



నారాయణపేట, నంవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ పోరులో రిజర్వేషన్ల కేటాయింపులో మార్పులు చాలామంది ఆశావహులకు నిరాశ కలిగించింది. 'అనుకున్నదొకటి.. అయ్యింది మరొకటి' అని వారు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ యోజకవర్గంలోని 4 మండలాలు నారాయణపేట జిల్లా పరిధిలోకి వస్తుండటంతో తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. వాటిలో కొన్ని స్థానాలు జనరల్ అవుతాయిని ఆశించినా, బీసీలకు రిజర్వు కావడంతో అభ్యర్థులకు నిరాశ తప్పడం లేదు. బీసీలకు రిజర్వ్ అవుతాయని భావించిన పలు స్థానాలు ఎస్సీలకు కేటాయించడంతో కొందరు పోటీ చేసే అవకాశం కోల్పోవాల్సి వచ్చింది. ఇలా రిజర్వేషన్లు మారిన పలు స్థానాల్లో ఎస్సీ అభ్యర్థుల వేటలో ఆయా పార్టీల నేతలు నిమగ్నమయ్యారు.

● కోస్గీ మండలంలో ముశ్రీఫా జనరల్ మహిళకు రిజర్వు కావడంతో సతీమణులను దించేందుకు పతులు సిద్ధం అవుతున్నారు.

● నాచారం, చెన్నారం సర్పంచ్ స్థానాలు బీసీలకు రిజర్వు అవుతాయని ఆశలు పెట్టుకున్న నాయకులు, ఆ గ్రామాలు ఎస్సీ రిజర్వు కావడంతో బీసీ నాయకులు ఆశలు అడియాశలయ్యాయి. దీంతో ఎస్సీ అభ్యర్థి కోసం ప్రధాన పార్టీల నాయకులు అన్వేషిస్తున్నారు.

● గుండుమాల్ సర్పంచ్ స్థానం జనరల్ అవుతుందని ఆశించినా, బీసీలకు రిజర్వ్ కావడంతో జనరల్ అభ్యర్థులు కంగుతినగా, బీసీ అభ్యర్థులకు కలిసి వచ్చింది.

● కొత్తపల్లి సర్పంచ్ స్థానం జనరల్ కావడంతో పోటీదారులు రెట్టింపయ్యారు. భూనేడ్ జనరల్ అవుతుందని అనుకున్నా, ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో జనరల్, బీసీ అభ్యర్థులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

● నిడ్జింత జనరల్ స్థానం కావడంతో పోటీ తీవ్రమైంది. మద్దూర్ మండలంలోని పల్లెర్ల, చేన్వార్, జాదురావుపల్లి స్థానాలు బీసీలకు రిజర్వు అవుతాయని భావించినా, ఎస్సీలకు కేటాయించడంతో పోటీచేసే అవకాశం కోల్పోయి ఆశవాహులు నిరాశకు గురయ్యారు.

● మాగనూర్ మండలంలోని నేరడ్‌గామ్ పంచాయతీ ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో ఆశావహులు నిరాశ పడ్డారు. నారాయణపేట మండలంలోని కొల్లంపల్లి ఎస్సీలకు రిజర్వ్‌కావడంతో మిగతా వారు పోటీ చేసే అవకాశం కోల్పోయారు.

● జాజాపూర్ బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో జనరల్ అభ్యర్థులకు ఆశాభంగం కలిగింది. బోయిన్‌పల్లి ఎస్సీలకు రిజర్వ్ కావడంతో నిరాశ పడక తప్పలేదు.

● కొల్లంపల్లి, జాజాపూర్, బోయిన్‌పల్లి పంచాయతీలు గత ప్రభుత్వ హయంలో జనరల్ కాగా, ఈ సారి కూడా అదే ఉంటుందని భావించిన నాయకులకు రిజర్వేషన్ మారడంతో నిరాశ తప్పలేదు. మరికల్ సర్పంచ్ ఎస్సీలకు రిజర్వ్ కావడంతో ఇక్కడే అదే పరిస్థితి నెలకొన్నది.

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి స్వగ్రామం తీలేర్ పంచాయతీ ఎస్సీలకు రిజర్వ్ కావడంతో ఇతర నాయకులు నిరాశకు గురయ్యారు. నర్వ సర్పంచ్ స్థానం జనరల్ కావడంతో పోటీ చేసే అవకాశం అందరికీ కలిసివచ్చింది.

● పాతర్‌చెడ్ ఎస్సీ మహిళకు, పెద్దకడ్మూర్ పంచాయతీ బీసీలకు రిజర్వు కావడంతో జనరల్ కేటగిరీ నాయకులు నిరాశ చెందారు.



స్థానికులకే అవకాశం

నారాయణపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్ స్థానానికి పోటీ చేయాలనుకునే వారు తప్పనిసరిగా స్థానికుడై ఉండాలి. స్థానిక ధ్రువపత్రం కలిగి ఉండాలి. పోటీ చేసే అభ్యర్థి పేరు పంచాయతీ ఓటరు జాబితాలో నమోదై ఉండాలి. అభ్యర్థి వయస్సు 21 సంవత్సరాలు నిండి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వ్ చేసిన స్థానాల్లో పోటీ చేసేందుకు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలి ఉంటుంది. జనరల్‌కు కేటాయించిన స్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరి అభ్యర్థులు కూడా పోటీ చేసే అవకాశం ఉంటుంది. మహిళలు వారికి కేటాయించిన స్థానాలతో పాటు అదే కేటగిరీలోని జనరల్ స్థానాల్లో పోటీ చేయొచ్చు. ఇద్దరు పిల్లల నిబంధన లేనందున ఎంత మంది పిల్లలు ఉన్న వారైనా పోటీ చేసేందుకు అర్హులు.



అంబేద్కర్ చౌరస్తాలో ముసుగు లేని పార్టీ గుర్తు

ముసుగు వేయాలి 'గుర్తు' మీద..

నర్వ ,నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల కోడ్ అమలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నారాయణపేట జిల్లా, నర్వ మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో వివిధ పార్టీలకు చెందిన స్తంభాలపై ఉన్న పార్టీ గుర్తులకు ముసుగు వేసినా, ఒక గుర్తును మాత్రం వదిలేశారు. దీనిపై స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం

» హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్ నాయకుడు

వెల్దండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం జరిగిందంటూ నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని తిమ్మినోనిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గండికోట రాజు బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించలేదని ఆయన ఆరోపించారు. పంచాయతీ ఎన్నికలను నిలిపివేయాలని లేదా రిజర్వేషన్లను సవరించాలని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వెల్దండ మండలంలో 32 గ్రామపంచాయతీలు ఉండగా, 15 శాతం జనాభా ఉన్న ఎస్సీలకు 5 స్థానాలు కేటాయించారని, 23 శాతం ఉన్న బీసీలకు కేవలం 4 స్థానాలు కేటాయించారని ఆరోపించారు. తిమ్మినోనిపల్లిలో 8 వార్డులు ఉండగా, 4 ఎస్సీ, ఎస్టీలకు కేటాయించారని, మరో 4 జనరల్‌కు రిజర్వు చేశారని తెలిపారు. బీసీలకు ఒక్క స్థానం కూడా దక్కలేదని పేర్కొన్నారు. మండలంలో 12 ప్రత్యేక గిరిజన గ్రామ పంచాయతీలు ఉన్నాయని, కొన్ని గ్రామాల్లో బీసీ జనాభా ఉన్నా, వాటిని సైతం ఎస్టీలకు కేటాయించారని గండికోట రాజు తన ఫిర్యాదులో వివరించారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

» భక్తిశ్రద్ధలతో గోపుర కలశ ప్రతిష్ఠ
» కొండారెడ్డిపల్లిలో ఆధ్యాత్మిక శోభ
» ఉత్సవానికి హాజరైన సీఎం సోదరులు



గోపుర కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో సీఎం సోదరుడు కృష్ణారెడ్డి, నాయకులు

వంగూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం, నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లిలో పునర్నిర్మించిన ఈదమ్మ, మాంధాత దేవాలయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి సహకారంతో రూ. 26 లక్షల వ్యయంతో ఆలయాన్ని పునర్నిర్మించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో శోభాయనంగా అలంకించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య గోపుర కలశాన్ని, ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. సీఎం సోదరుడు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఎనుముల కృష్ణారెడ్డి, జగాల్‌రెడ్డి, రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి ముత్యాల లక్ష్మారెడ్డి తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మాజీ ఎంపీపీ భీమమ్మ లాలుయాదవ్, ఉపసర్పంచ్ వేమారెడ్డి, పులజాల కృష్ణారెడ్డి, బొజ్జ కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాములుయాదవ్, రాఘవేందర్ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



పూజలు నిర్వహిస్తున్న చిలుక వివేక్‌రెడ్డి వేద పండితులు గంగాధర శర్మ

తిమ్మాజిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాజిపేట మండలం అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయంభుగా వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో 35అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు బుధవారం భూమి పూజ నిర్వహించారు. అప్పాజీపల్లి నివాసి చిలుక గోపాల్‌రెడ్డి జ్ఞాపకార్థమై కుమారుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఆలయ కమిటీ అధ్యక్షుడు చిలుక వివేక్‌రెడ్డి, దివ్య దంపతులు బుధవారం భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. వేద పండితులు గంగాధర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు లక్ష్మీనరసింహస్వామి అండాలమ్మ మహాలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర శతనామావళి పట్టించి గోత్రనామాలు చదివి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిలుక సురేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రామచంద్రారెడ్డి, ఎల్లారెడ్డి, రమేష్, అవినాష్‌రెడ్డి, సుందరయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం



సామూహిక ఒడి బియ్యం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కందనూలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డ వినోబానగర్ కాలనీలోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో బుధవారం నిర్వహించిన కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా ఉత్సవం నిర్వహించారు. బుధవారం ఉదయం శ్రీవల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవాల విగ్రహాలను ధర్మకర్త భూదానం సుబ్బారావు ఇంటి నుంచి పల్లకిలో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం అభిజిత్‌లగ్నంలో కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం ఆడపడుచులకు ఒడిబియ్యం పోశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ప్రధాన అర్చకులు నర్వ వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ధర్మకర్త కుటుంబ సభ్యులు, సహాయ అర్చకులు వరప్రసాద్‌శర్మ, భారతి, విజయ్‌కుమార్, జీవీ.రామకృష్ణ, రామన్‌గౌడ్, లలిత పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠ



బ్రహ్మగిరిలో అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠిస్తున్న ధ్వజస్తంభం

బ్రహ్మగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత నలభై మూడు ఏళ్లక్రితం బ్రహ్మగిరిలో నిర్మించిన అయ్యప్పస్వామి దేవాలయంలో ధ్వజస్తంభం లేకపోవడంతో అయ్యప్పస్వామి భక్తులు, గ్రామస్థుల సహకారంతో దేవాలయ ప్రాంగణంలో గత మూడు రోజులుగా సోమేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో వేదపండితుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణతో యజ్ఞాలు, హోమాలు నిర్వహించారు. బుధవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితులు ప్రాణ ప్రతిష్ఠాపన చేసి ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. సాయంత్రం అయ్యప్పస్వామి మూల విరాట్‌కు, నూతన ధ్వజస్తంభానికి మహా మంగళహారతి, తీర్థప్రసాదాలను భక్తులకు అందించారు. కార్యక్రమంలో రవీంద్రబాబు, సుబ్బారెడ్డి, హన్మంతు, వెంకటయ్య, రామస్వామి, చంద్రశేఖర్, రాము, వంశీ అయ్యప్ప దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పెద్దమ్మ తల్లి ఆలయం ముందు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

రాజోలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలిలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహం, ఆవరణలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఉదయం అమ్మ వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి అర్చకులు ప్రాణప్రతిష్ఠ చేశారు. అనంతరం ఆలయం ముందు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించి, పూజలు చేశారు. ఆ తర్వాత గ్రామంలోని ప్రధాన వీధిలో బొడ్రాయిని పునఃప్రతిష్ఠించా రు. ఉత్సవానికి హాజరైన భ క్తులకు అన్నదనం చేశారు. ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠలకు సహకరించిన దాతలను ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం ఆడప డుచులు సారె, ఒడిబియ్యంతో అమ్మవారిని దర్శించుకొని నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు గంగిరెడ్డి, గోపాల్, జయన్న గౌడు, దస్తగిరి, గోవర్ధన్‌రెడ్డి, రాజ్‌కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ కల్యాణోత్సవం

» స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



గంగాభవానీ ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

రాజోలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండల కేంద్రంలో గంగాభవానీ, పరమేశ్వర కల్యాణోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ సమీపంలోని తుంగభద్ర నది నుంచి నీరు తీసుకొచ్చి స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు అభిషేకం చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులు, మత్స్యకారుల సంఘం సభ్యుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపించారు. అనంతరం వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శివస్వాములు, అయ్యప్ప మాలధారులతో పాటు భక్తులకు అన్నదానం చేశారు. ఆ తర్వాత ఆలయ ఆవరణలో భక్తులు భజన చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి గ్రామంలో ఊరేగించారు.

భగవద్గీత కంఠస్త పోటీలకు ఎంపిక



మరాఠీ మోక్షిత

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట పట్టణంలోని అశోక్ నగర్ శిశుమందిర్ విద్యార్థిని మరాఠీ మోక్షిత రాష్ట్ర స్థాయి భగవద్గీత కంఠస్త పోటీలకు ఎంపికయ్యింది. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో మోక్షిత ప్రథమ స్థానంలో నిలిచింది. తమ కుమార్తెకు చిన్నప్పటి నుంచి హనుమాన్ చాలీసా, భగవద్గీత శ్లోకాలను కంఠస్తం చేయించామని తల్లిదండ్రులు స్వప్నరాణి, వెంకట్రాములు తెలిపారు.

CHANGE OF NAME

I, **PINJARI SYDA BI** (Old Name) H.No: 2-70, Gundimalla, Jogulamba Gadwal dist., T.G. State. have changed my name as **PINJARI SHAHEDABI** (New Name) W/o Pinjari Khaja Miah.

AJL-247997



న్యూస్ బాక్స్

మునిసిపల్ ఉద్యోగుల ముందస్తు అరెస్టు

అయిజ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ముందస్తు అరెస్టు చేసి అయిజ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తమ హక్కుల సాధనలో భాగంగా బుధవారం హైదరాబాద్‌లో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి తరలివెళ్లకుండా అయిజ మునిసిపల్ కార్మికులు నరేశ్, మహేంద్రనాథ్, నాగరాజు, అడివన్న, వీరేష్, అంజనేయులును అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించటం జరిగింది. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

దివ్యాంగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు

గద్వాల న్యూటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగుల జిల్లా స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 29న జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. ఆసక్తి గల వారు 29 లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రశ్నపత్రాల తయారీపై వర్క్‌షాప్

గద్వాల సర్కిల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గద్వాలలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో బుధవారం సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ) 2 పరీక్షల ప్రశ్నపత్రాల తయారీ, నిర్వహణపై డీసీఈబీ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేలా ప్రశ్నపత్రాలను రూపొందించాలని ప్రతాప్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సలహాలను, పరీక్షల నిర్వహణను తయారీదారులకు వివరించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు వెంకటనర్సయ్య, జహీరుద్దీన్, వరదసుందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సంఘటితంగా పోరాడుదాం



సభ్యత్వ నమోదులో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నాయకులు

అలంపూరు చౌరస్తా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంఘటితమై సమస్యల పరిష్కారానికి పోరాడుదామని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు శ్యామ్, శ్రీనువాసులు, చుక్క సుదర్శన్‌రెడ్డి, పురేందర్ అన్నారు. గురువారం యూనియన్ సభ్యత్వ నమోదులో భాగంగా మల్దకల్, అయిజ, వడ్డేపల్లి, ఉండవల్లి, మానవపాడు తదితర మండలాల్లో పర్యటించారు. పాత్రికేయులతో సమావేశమయ్యారు. పాత్రికేయుల సమస్యలతపై కలిసి పోరాడాలని రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 30న గద్వాలలో జరిగే నాలుగవ సభకు జిల్లాలో ప్రతీ పాత్రికేయుడు హాజరుకావాలని కోరారు.

అయ్యప్ప స్వాములకు బిక్ష ఏర్పాటు



ఆలయంలో భిక్ష చేస్తున్న అయ్యప్ప స్వాములు

గద్వాలఅర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణలో ఉన్న స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు, స్వాములు, కాలనీవాసులు ఉన్నారు.

తమ్ముడు అనుమానాస్పద మృతిపై అన్న ఫిర్యాదు

గద్వాల క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నందిన్నె గ్రామంలో అనుమానాస్పదంగా మరణించిన తన తమ్ముడి మరణంపై విచారణ జరిపాలని కోరుతూ మంగళవారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయంలో మృతుడి అన్న కుర్వ వీరన్న ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మేము నలుగురు అన్నదమ్ములమని, అందులో మా రెండవ తమ్ముడైన రామాంజనేయులు 2025, మే 27న సాయంత్రం నందిన్నె గ్రామంలో(కర్నాటక బార్డర్) భారత్‌మాల రహదారిపై ప్రమాదానికి గురై చనిపోయాడని, ప్రమాదం జరిగిన తీరుపై అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై రాయిచూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశామని, రెండురోజుల క్రితం జరిగిన మాజీ సర్పంచ్ చిన్నభీమరాయుడు యాక్సిడెంట్ కేసులో అనుమానితుల్లో ఒకరు గబ్బర్ వీరన్నకు మాతమ్ముడి భార్యతో వివాహేతర సంబంధం ఉందని, తమ్ముడు గతంలో ఒకసారి ప్రత్యక్షంగా పట్టుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. తమ్ముడి మరణం తర్వాత రాయిచూర్ పోలీసులను పోస్టుమార్టం రిపోర్టు కోరగా మా తమ్ముడి భార్య రిపోర్టు ఇవ్వద్దని చెప్పారని తెలిపారు. దీంతో మాకు అనుమానం కలిగిందని పూర్తిగా విచారణ చేసి మాకు న్యాయం చేయాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

● కలెక్టర్ బీఎం సంతోష్

● మండలాల రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ ఎన్నికలను ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా నిర్వహించాలని కలెక్టర్ బీఎం సంతోష్ చెప్పారు. బుధవారం గద్వాల ఐడీవోసీలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని ఆయా మండలాల రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణ, నిబంధనలపై నిర్వహిస్తున్న శిక్షణపై పూర్తి అవగాహనతో ఎన్నికల విధులు జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, పరస్పరం సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ఏ దశలోనూ అలసత్వానికి తావులేకుండా, ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు అనుక్షణం జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. నామినేషన్ల స్వీకరణ స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ తదితర అన్ని ప్రక్రియలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, ఏ చిన్న సమస్యను రానివ్వకూడదని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీపీవో నాగేంద్రం, శిక్షణ జిల్లా నోడల్ అధికారి రమేశ్ బాబు, మాస్టర్ ట్రైనర్ నరేష్, జహీరుద్దీన్, అగస్టీన్, విష్ణు, కృష్ణ ఉన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

● మొదటి విడతలో గద్వాల, ధరూరు, కేటీదొడ్డి

● మొత్తం 20 కేంద్రాల్లో స్వీకరణకు ఏర్పాట్లు

గద్వాల, ధరూర్, కేటీదొడ్డి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు గురువారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. దీనికోసం మొదటి విడతలో జిల్లాలోని మూడు మండలాల్లో మొత్తం 20 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాలకు కేటాయించిన కేంద్రాల్లో సర్పంచు, వార్డు మెంబర్ల స్థానాలకు అభ్యర్థుల నుంచి అధికారులు నామినేషన్లను స్వీకరించనున్నారు.

గద్వాల మండలంలో ఆరు నామినేషన్ సెంటర్‌లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో డా.శైలజ తెలిపారు. అలాగే ధరూర్ మం డలంలో ఏడు నామినేషన్ సెంటర్‌లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి పేర్కొన్నారు. కేటీదొడ్డి మండలంలో ఏడు నామినేషన్ సెంటర్‌లను ఏర్పాటు చేశామని ఎంపీడీవో రమణరావు తెలిపారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు చేయాలి

● అధికారుల సమావేశంలో కలెక్టర్

గద్వాలన్యూటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీవోసీలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. మండలాల్లోని ఎంపీడీవోలకు ఎన్నికల్లో సహకరించేందుకు తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించామన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తహసీల్దార్లు సహకరించాలన్నారు. ఎన్నికల్లో అవసరం మేరకు జీపీవోలకు విధులు కేటాయించి వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల స్వీకరణ గురువారం నుంచి ప్రారంభమవుతుందని అన్నారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా, నిబంధనల ప్రకారం.. పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్‌లు స్వీకరించాలన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేయవద్దని, ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లకు ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు, ట్రైనీ కలెక్టర్లు, అధికారులు ఉన్నారు.

పకడ్బందీగా 2వ సాధారణ ఎన్నికలు

2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని హైదరాబాద్ నుంచి అదనపు డీజీపీ మహేష్ భగవత్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి గ్రామ పంచాయతీ ఎన్నికలను రాష్ట్రంలో పక్కాగా నిర్వహించాలని సూచిస్తూ కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్పీ శ్రీనివాసరావు వీసీలో మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో పంచాయతీ ఎన్నికలను మూడు విడతలలో పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫ్లయింగ్, స్టాటిస్టిక్, వీడియో సర్వేయలేన్స్ బృందాలు, మీడియా సెల్, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బాసు హనుమంతు నాయుడు

● బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు బాసుహనుమంతు నాయుడు

గద్వాల న్యూటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో గులాబీ జెండా ఎగురవేయాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు బాసుహనుమంతు నాయుడు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఈనెల 29వ తేదీనా జరిగే దీక్షా దివస్ కార్యక్రమం, స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో నిలిచిపోయేరోజు నవంబరు 29 అన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అన్న నినాదమే ఉద్యమానికి ఊపిరైందన్నారు. కేసీఆర్ ఆమరణ దీక్షతోనే కేంద్రం మెడలు వచ్చి తెలంగాణ రావడం జరిగిందన్నారు. అలాగే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో గులాబీ జెండాను ఎగిరేలా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కార్యకర్తలకు చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్, నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, అతికూర్ రహమాన్, కృష్ణారెడ్డి, బసవరాజు, ప్రతాప్, కుర్వ పల్లయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సరిత

కేటీదొడ్డి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత శుక్రవారం ధరూర్ మండలంలోని జాంపల్లి దగ్గర కేటీదొడ్డి మండలం నందిన్నె గ్రామం మాజీ సర్పంచ్ చిన్న భీమరాయుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి సరిత బుధవారం నందిన్నె గ్రామంలోని మృతుడి స్వగృహంలో చిన్న భీమరాయుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మధుసూదన్‌బాబు, ఎస్.కృష్ణ, ఆనంద్‌గౌడ్, వెంకట్రామిరెడ్డి, భాస్కర్‌యాదవ్, టీఎన్‌ఆర్ జగదీశ్, నర్సింహులు, నందిన్నె గ్రామస్తులు ఉన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ మన బాధ్యత



గద్వాలలో ర్యాలీ నిర్వహిస్తున్న భీమ్ ఆర్మీ నాయకులు



గద్వాలలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న కళాశాల సిబ్బంది



అయిజలో రాజ్యాంగ పుస్తకాలను అందజేస్తున్న నాగర్‌దొడ్డి వెంకట్రాములు

- జిల్లాలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

గద్వాల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ప్రతీ పౌరుడు తన బాధ్యతగా గుర్తించాలని భీమ్ ఆర్మీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ అన్నారు. రాజ్యంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీ అనంతరం స్థానిక పాతబస్టాండ్ సర్కిల్‌లో సభ నిర్వహించారు. భారత రాజ్యాంగానికి ఉన్న ప్రత్యేకత, రాజ్యాంగ రచన కోసం జరిగిన కృషి, రచనలో అంబేడ్కర్ పాత్ర తదితర అంశాలపై వివరించారు. రాజ్యాంగ రద్దు కోసం జరుగుతున్న కుట్రను ప్రజాస్వామికవాదులు తిప్పికొట్టాలని పిలుపునిస్తూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, బీఆర్‌ఎస్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, పల్లయ్య, న్యాయవాది మధుసూదన్‌బాబు, స్వేరో జిల్లా అధ్యక్షుడు సునంద్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఏసురాజు, కవి అవనిశ్రీ, కరుణాకర్, వేమన్న, నరసింహులు, లావణ్య, పద్మ, వినోద, మహేశ్వరి ఉన్నారు. ఈసందర్భంగా రాజ్యాంగ పుస్తకాలను పంపిణీ చేశారు.

● వామ్ సేఫ్ నాయకుల నివాళి: రాజ్యంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని వామ్ సేఫ్ నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి రాజ్యాంగ పీఠికను పఠిస్తూ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇమ్మానుయేల్, సిద్దార్థ కృష్ణ, రాజన్న, భూషన్న, రామకృష్ణ, జయన్న, సుందర్ రాజ్, వాల్మీకి, అయ్యన్న, సురేష్‌బాబు, దానయ్య ఉన్నారు.

● పలు విద్యాలయాల్లో..

గద్వాల సర్కిల్ : గద్వాల పట్టణ, మండల పరిధిలోని పలుప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్స్ హెచ్ఎంలు, కరస్పాండెంట్లు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

● బీజేపీ ఆధ్వర్యంలో..

గద్వాల టౌన్ : ప్రజాస్వామిక స్ఫూర్తి, నైతిక విలువతో కూడిన భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. బుధవారం పట్టణంలోని డీకే బంగ్లాలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకట్రాములు, రవికుమార్ ఎగ్బోటే, శ్యామ్‌రావు, శివారెడ్డి, దేవదాస్, తిరుపతి రెడ్డి, రఘుగౌడ్, పాండు, అశోక్, వంశీ ఉన్నారు.

● మల్దకల్‌లో

మల్దకల్‌లో కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోవిందు, వెంకటన్న, రాజశేఖర్, దేవన్న, అవినాష్, సత్యన్న, యేసు ఉన్నారు.

● అయిజలో..

అయిజ : ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, కార్యాలయాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ప్రజా సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అయిజలోని అంబేడ్కర్ విగ్రహానికి ఘనంగా నివాళిఅర్పించారు.

● రాజోలిలో..

రాజోలి: రాజోలిలో కేవీపీఎస్ మండల కార్యదర్శి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లక్ష్మన్న, ఆనంద్ బాబు, రాజు, బొజ్జన్న, నాగప్ప పాల్గొన్నారు.

● ఉండవల్లిలో..

ఉండవల్లి: మండల కేంద్రంలో పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు రేఖవెంకట్ గౌడ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నాగరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్దిలేటి, రవి, సూరి, రజాక్‌మియా, నరసింహ, లబ్బి, ఆటో మహబూబ్‌బాషా, సీఐటీయూ నాయకుడు వెంకటేశ్వర్లు ఉన్నారు.

● ఇటిక్యాలలో..

ఇటిక్యాల : భారత రాజ్యాంగాన్ని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. ఇటిక్యాలలోని అంబేడ్కర్ ఎ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామకృష్ణ, యాకోబు, జాన్, అబ్రహం, గోపి, రాజు, దావీదు పాల్గొన్నారు.

● ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో

గద్వాల సర్కిల్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం.. పుస్తకం మాత్రమే కాదని అది ఒక శక్తివంతమైన మార్గదర్శక గ్రంథమని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌నాయక్ పేర్కొన్నారు. గద్వాలలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన జాతీయ రాజ్యాంగ దినోత్సవ వేడుకలకు న్యాయాధికారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం సమాజ సేవలో తమవంతు పాత్ర పోషిస్తామని న్యాయాధికారితో పాటు కళాశాల సిబ్బంది, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ, అధ్యాపకులు, గద్వాల సెక్టార్ ఎస్సై జహంగీర్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు రాజేందర్, శ్రీనివాసులు, లక్ష్మన్న, స్వామి, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు వీడాలి

● రైతాంగ సమితి రాష్ట్ర కార్యదర్శి గోపాల్

● ప్రజా, కార్మిక, రైతు సంఘాల నిరసన



గద్వాల కృష్ణవేణి చౌక్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా, కార్మిక, రైతు సంఘాల నాయకులు

గద్వాల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, వ్యతిరేక విధానాలను విడనాడాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ యాదవ్ అన్నారు. కార్పొరేట్ కంపెనీల దోపిడీని అరికట్టి దేశ సారభౌమాధికారాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.కేంద్రం ప్రభుత్వ తీరును నిరసిస్తూ రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులతో బుధవారం పట్టణంలోని కృష్ణవేణి చౌరస్తాలో నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో మాట్లాడిన సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, రైతుల ప్రయోజనాల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం పట్టింపులేదన్నారు. రుణమాఫీ చట్టం, పంటల కనీస మద్దతు ధర చట్టాల గురించి పట్టించుకోని కేంద్రం లేబర్ కోడ్‌లను మాత్రం అమలు చేయడం సిగ్గుచేటన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని పటిష్టం గా అమలు చేయాలని, అతివృష్టితో పంట నష్టానికి గురైన రైతులకు పరిహారం అందజేయాలని, ఉపాధి హామీ వేతనం పెంచి 200 పని దినాలు కల్పించాలని, విద్యుత్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించాలని నాయకులు డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో సంయుక్త కిసాన్‌మో ర్చా, భారతీయ కిసాన్ మజ్దూర్ యూనియన్, పౌర హక్కుల సంఘం నాయకు లు వీవీ నరసింహ, ఆశన్నసుబాన్, నరసింహ, మల్లేశ్, గట్టన్న, ఖాజా, విష్ణు, భాస్కర్, ఎల్లప్ప, పరశురాముడు ఉన్నారు.

రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలి



చిన్నారుల ఆరోగ్య విషయాలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో సంధ్యాకిరణ్మయి

● డీఎంహెచ్‌వో సంధ్యాకిరణ్మయి

గద్వాల న్యూటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలందేలా చూడాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్యాకిరణ్మయి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రిలోని ఎస్‌ఎన్‌సీయు, డీకేర్, జిర్యాట్రిక్ వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డే కేర్ క్యాన్సర్ సెంటర్‌లో జరిగిన అడ్మిషన్లు జిల్లాలో ఉన్న క్యాన్సర్ కేసుల వివరాలు ఆసుపత్రిలో ఉంచుకొని వచ్చిన వారికి ట్రీట్‌మెంట్ ఇచ్చేదిశగా పనిచేయాలని, ఎమ్ఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి నుంచి ట్రీట్మెంట్ తీసుకొని వచ్చిన వారికి ఇక్కడ వైద్యం అందిస్తారని, సరైనా మందులు పంపిణీ చేస్తున్నారనే విషయాలపై రోగులకు అవగాహన కల్పించాలన్నారు. పాలియేటివ్ కేర్‌లో అడ్మిషన్ అయిన పేషెంట్‌కు అందుతున్న చికిత్స గురించి ఆరాతీసారు. అలాగే జిర్యాట్రిక్ వార్డు అనగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రికి వచ్చిన 60 సంవత్సరాలు పైబడిన వారందరికీ 20 బెడ్స్ వరకు ప్రత్యేకంగా కేటాయించి వైద్యసేవలు అందించాలన్నారు. అనంతరం స్పెషల్ బార్న్‌కేర్ యూనిట్(ఎస్ఎన్‌సీయు)లోని చిన్నారుల ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అడ్మిషన్ అయిన వారందరికీ నాణ్యమైన చికిత్సలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో హేమలత, చిన్నపిల్లల డాక్టర్లు అశోక్, భరత్, ప్రదీప్, నాగార్జున, సౌమ్య ఉన్నారు.

'మంత్రి కోమటిరెడ్డి క్షమాపణ చెప్పాలి'

గద్వాలటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి ముద్దుబిడ్డ పున్న కైలాస్ నేతను అవమానించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పద్మశాలీలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని పద్మశాలి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పులిపాటి వెంకటేష్ బుధవారం ఒక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం నల్లగొండ డీసీసీ అధ్యక్షుడిగా నియమించిన కైలాస్, మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసేందుకు వెళ్లిన సందర్భంలో ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అగ్రవర్ణ దురహంకారమని పేర్కొన్నారు.

ప్రభుత్వ సలహాదారుడిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు



ప్రభుత్వ సలహాదారుడిని సన్మానించి మొక్కను ఇస్తున్న గద్వాల డీసీసీ అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి

గద్వాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసిశారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిని శాలువాతో సన్మానించి మొక్కను అందజేశారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నిస్థానాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగుర వేయాలని, యూత్ కాంగ్రెస్‌లో ఏ విధంగా కష్టపడి పనిచేశారో అదే స్ఫూర్తితో జిల్లాలో ఉన్న నాయకులందరినీ కలుపుకుని పార్టీని మరింత పటిష్టం చేయాలని వేంనరేందర్‌రెడ్డి సూచించారు.

లేబర్ కోడ్‌లను ఎత్తివేసే దాకా ఉద్యమిస్తాం

● ఎల్ఐసీ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు



మాట్లాడుతున్న బంగి రంగారావు

గద్వాల న్యూటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే ఎత్తివేసే దాకా ఉద్యమిస్తామని గద్వాల ఎల్ఐసీ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు అన్నారు. బుధవారం గద్వాల జిల్లా ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయం ముందు భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఉన్నఫలంగా అమలులోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఆల్‌ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నిర్బంధంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు నర్సింగ్, ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు, నాయకులు రాఘవేంద్ర, సూరజ్, శివశంకర్, ఉదయ్‌కుమార్, మనీష్, సుదర్శన్ శెట్టి, శైలేష్, కృష్ణచైతన్య, లక్ష్మీకాంత్ ఉన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారులు

● కూల్చితే పెట్రోల్ పోసుకుంటామన్న మహిళలు



అధికారులకు ధ్రువపత్రాలు చూపుతున్న బాధితులు



ఒంటిపై పెట్రోల్ పోసుకునే ప్రయత్నం చేస్తున్న మహిళ

అయిజ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలు చేశారు కూల్చివేస్తామని అధికారులు యంత్రపరికరాలు, సిబ్బందితో కలిసివెళ్లారు. అయిజ మునిసిపాలిటీ పరిధిలో బుధవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. అంబేడ్కర్ విగ్రహానికి ఎదురుగా నిర్మాణాలు సాగుతున్నాయి. ఇది అక్రమ నిర్మాణం అని భావించిన మునిసిపల్ అధికారులు కూల్చేందుకు యంత్రపరికరాలు, సిబ్బంది, ట్రైనీ ఎస్ఐ తరుణ్‌రెడ్డి, పోలీసులతో కలిసి వెళ్లారు. నిర్మాణాలు చేస్తున్న వారు సమాచారం తెలుసుకుని అక్కడికి వచ్చి అడ్డుకున్నారు. బాటిళ్లలో పెట్రోల్ తెచ్చుకున్నారు. నిర్మాణాలను కూలిస్తే శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటామని మహిళలు స్పష్టంచేశారు. దీంతో ధ్రువపత్రాలు చూపాలని అధికారులు వారిని కోరారు. వారు చూపిన పత్రాలపై నమ్మకం కలగని అధికారులు కూల్చేందుకు సిద్ధమయ్యారు. దీంతో మహిళలు శరీరంపై పెట్రోల్ పోసుకునే ప్రయత్నాలు చేశారు. చేసేదిలేక అధికారులు నాలుగు రోజుల వ్యవధిలో సరైన ధ్రువపత్రాలు చూయించాలని, అప్పటివరకు చేస్తున్న నిర్మాణాలను ఆపాలని ఆదేశించారు. దీనికి నిర్మాణాలు చేస్తున్న వ్యక్తులు ఒప్పుకోవటంతో వెళ్లిపోయారు.